హైదరాబాద్ వార్త



# గుండె గుబేల్..

- యువతలో పెరుగుతున్న గుండె జబ్బులు
- ఒత్తిడి, జీవన విధానం ప్రధాన కారణం
- ఎథిరోస్కెలోటిక్ ప్లేక్ వల్లే మరణాలు
- ప్రధాన రక్తనాళాల్లో అడ్డంకులతో గుండెపోటు
- ముందస్తు పరీక్షలతో సమస్యను గుర్తించే వీలు



**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** ఇటీవల యుక్త వయసు వారిలోనూ గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. దీనికి జీవన విధానంలో వచ్చిన మార్పులే ప్రధాన కారణమని వైద్యులు విశ్లేషిస్తున్నారు. ప్రకృతి విరుద్ధమైన జీవన విధానం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడితో కూడిన జీవితం, సరైన నిద్ర లేకపోవడం తదితర అంశాలు దీనికి కారణంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. దృఢంగా ఉన్నట్టు కనిపించినా.. హఠాత్తుగా గుండె జబ్బులకు గురై.. మరణించడానికి ఇవే కారణమని విశ్లేషిస్తున్నారు. రోజువారీ తీసుకునే ఆహారంలో కొవ్వు పదార్థాలు ఎక్కువగా వుంటే కొలెస్ట్రాల్ పెరుగుతుంది. కొలెస్ట్రాల్, కాల్షియం వల్ల రక్తనాళాల్లో సున్నపు పూత మాదిరిగా ఏర్పడుతుంది. దీనినే ఎథిరోస్కెలోటిక్ ప్లేక్ అని అంటారు. తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు రక్తనాళాల్లో ఏర్పడిన ఈ పూతలో పగుళ్లు ఏర్పడతాయి. ఈ ప్రాంతంలో ప్లేట్‌లెట్స్ అతుక్కుపోయి రక్తం గడ్డ కట్టేలా చేస్తాయి. దీంతో రక్తం సరఫరాకు అంతరాయం ఏర్పడి స్ట్రోక్‌కు గురిచేస్తుంది. బ్రెయిన్‌లో గడ్డ కడితే బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్‌లో కడితే హార్ట్ స్ట్రోక్ వస్తుంది.

**ఎప్పుడైనా జరగొచ్చు**

రక్తనాళాల్లో ఏర్పడిన పూత (ఎథిరోస్కెలోటిక్ ప్లేక్)లో పగుళ్లు ఎప్పుడైనా పడొచ్చని వైద్యులు చెబుతున్నారు. పరిగెత్తినప్పుడు, హార్డ్ వర్కవుట్స్ చేసినప్పుడు, పని ఒత్తిడికి గురైనప్పుడు హార్ట్‌రేట్, తద్వారా బీపీ పెరుగుతుంది. దీనివల్ల రక్తనాళం ఒత్తిడికి గురై ఎథిరోస్కెలోటిక్ ప్లేక్‌కు దారితీయొచ్చు. గుండెకు పలు రక్తనాళాల ద్వారా రక్తం సరఫరా అవుతుంది. చిన్న నరాల వద్ద బ్లాక్ అయినప్పుడు పెద్దగా డ్యామేజ్ లేకున్నా, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధానమైన రక్తనాళంలో ఈ తరహా సమస్య ఏర్పడితే గుండెకు పూర్తిగా రక్తం సరఫరా ఆగిపోయి గుండెపోటుకు దారితీసి, ప్రాణాలను బలిగొంటుంది. దీనినే మాసివ్ హార్ట్ అటాక్ అని లేదా సడన్ కార్డియాక్ డెత్స్‌గా చెబుతారు.

**ఒత్తిడి వల్ల కూడా..**

ప్రస్తుతం మానవ జీవితంలో ఒత్తిడి తీవ్రంగా ఉంటోంది. తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు శరీరంలో కార్టికో స్టెరాయిడ్స్ ఉత్పత్తి పెరుగుతుంది. దీనివల్ల షుగర్ లెవెల్స్, బీపీ పెరగడం, ఫలితంగా రక్తనాళాలు కుచించుకుపోయి ఎథిరోస్కెలోటిక్ ప్లేక్‌కు దారితీసి గుండెపోటుకు గురిచేస్తుంది.

**యువతలో కనిపించే లక్షణాలివి**

ఛాతి మధ్య భాగంలో నొప్పి, గుండె బరువుగా అనిపించడం, ఎడమ చేతివైపు లోపలికి లాగుతున్నట్టు ఉండడం, బొడ్డు నుంచి కింది దవడ వరకూ పది నిమిషాల కంటే ఎక్కువ సేపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అకారణంగా చెమటలు పట్టడం. పొత్తి కడుపులో నొప్పి, కాళ్లు, చేతులు లాగుతున్నట్టు వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాల్సిందేనని నిపుణులు సూచిస్తున్నారు.

**వీటిపై దృష్టి అవసరం..**

వంశ పారంపర్యంగా గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉన్నవారు రెగ్యులర్‌గా పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి. కార్బోహైడ్రేట్స్, షుగర్ తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. కార్బోహైడ్రేట్స్ బాడీలో కొవ్వు రూపంలో లివర్, బ్రెయిన్, పొట్ట చుట్టూ చేరుతాయి. అంతేకాకుండా కొలెస్ట్రాల్ ఇబ్బందులకు గురిచేస్తుంది. శరీరంలో కొలెస్ట్రాల్‌ను ఎల్‌డీహెచ్, హెచ్‌డీఎల్ అని రెండు రకాలుగా చెబుతారు. ఎల్‌డీహెచ్‌ను చెడు కొవ్వుగా పరిగణించినప్పటికీ వాస్తవానికి ఇది చెడ్డది కాదు. కానీ పరిమితికి మించితే ముప్పు తెచ్చి పెడుతుంది. కాగా హెచ్‌డీఎల్‌ను మంచి కొవ్వుగా పిలుస్తారు. అంతేకాకుండా శరీరంలో ట్రై గ్లిజరేట్స్ కూడా ఉంటాయి. ఇది కూడా కొవ్వే. మనం తీసుకునే ఆహారం నుంచి వచ్చే అధికశక్తిని ఇది నిల్వ చేస్తుంది. శారీరక శ్రమ లేకపోవడం, సిగరెట్లు, మద్యం అలవాటు, అధిక బరువు ట్రై గ్లిజరేట్స్‌ను పెంచుతాయి. ఇది తక్కువగా అంటే 80లో ఉంచుకోవాలి. హెచ్‌డీఎల్ 40 కంటే ఎక్కువగా ఉండాలి. హార్ట్ స్ట్రోక్స్‌కు గురయ్యే వారిలో చెడు కొలెస్ట్రాల్ 200కు పైగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా రోజుకు కనీసం 45 నిమిషాలు వ్యాయామం చేయడం, 40 ఏళ్లు దాటిన పురుషులు, 50 ఏళ్లు పైబడిన మహిళలు గుండె పరీక్షలు చేయించుకోవాలి.

# గోల్కొండలో చిరుత సంచారం...

**-భయాందోళనలో స్థానికులు...**



తారామతి బారదరి ఇబ్రహీం బాగ్ వద్ద రోడ్డు దాటుతున్న చిరుత సిసి టీవీ ఫుటేజ్...

**మెహిదీపట్నం, జులై 28, ప్రభాతవార్త :** గోల్కొండ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపుతుంది. గత నాలుగు రోజులుగా రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్, గండిపేట మండలంలోని పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలకు చిరుత దృశ్యాలు కనిపించాయి. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు అటవీ శాఖ అధికారులు సిసి కెమెరాల తో పాటు 4 బోన్ లు కూడా ఏర్పాటు చేసినప్పటికీని ఫలితం లేకపోయింది. చిరుత చిక్కకపోవడంతో స్థానిక ప్రజల్లో తీవ్రభయాందలన మొదలైంది. కాగా తాజాగా గోల్కొండ ప్రాంతంలో సోమవారం వేకువ జామున ఇబ్రహీం బాగ్ మిలిటరీ ఏరియాలో లంగర్ హౌస్ నార్సింగ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు దాటుతున్న చిరుత దృశ్యాలు సిసి కెమెరాలలో రికార్డు అయ్యాయి. తారామతి మీదుగా మూసీ నది వైపు వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయాన్ని గోల్కొండ పోలీసులు అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందజేశారు. ఈ చిరుత సంచారంతో హైదరాబాదులోని మూసీ నది పరివాహక ప్రాంతమైన గోల్కొండ, లంగర్ హౌస్, జియాగూడ తదితర ప్రాంతాల్లో ప్రజలు బయోందనలకు గురవుతున్నారు. అయితే భయపడాల్సిన అవసరం లేదని త్వరలోనే చిరుతను పట్టుకుంటామని పోలీసులు సంబంధిత అధికారులు తెలిపారు.

# ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**-జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్**



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అడిషనల్ కమిషనర్లు పంకజ తదితరులు

**హైదరాబాద్, జులై 28, ప్రభాతవార్త:** ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమీషనర్‌కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ప్రతి అర్జీదారు సమస్య పరిష్కారం కోసం తిరిగి అదే సమస్య విన్నవించకుండా హెచ్ఓడి లు కృషి చేయాలన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 66 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 32, ట్యాక్స్, శానిటేషన్ విభాగాలకు 8 చొప్పున, ఇంజనీరింగ్ విభాగానికి 5, యు.బి.డి విభాగం 3, వెటర్నరి, కూకట్ పల్లి జోన్, విజిలెన్స్, ఎల్.డబ్ల్యూ.ఎస్, అడ్మిన్, ఎస్టేట్, ఫైనాన్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 3 ఫిర్యాదు అందాయి. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 93 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్, సికింద్రాబాద్ జోన్ లలో 33 చొప్పున, శేరిలింగంపల్లి జోన్ లో 18, ఎల్బీ నగర్ జోన్, చార్మినార్ జోన్ లలో 4 చొప్పున, ఖైరతాబాద్ జోన్ లో ఒక ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, వేణు గోపాల్, మంగతాయారు, సిఈ రత్నాకర్, హౌసింగ్ సి ఈ నిత్యానంద, డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ రామ్‌నాయక్, అడిషనల్ సిసిపిలు గంగాధర్, వెంకన్న, ప్రదీప్, డిప్యూటీ సిలు సంపద, పనస రెడ్డి, ఎస్ఎన్‌డిపి పివి రావు, హౌసింగ్ ఈఈ పివి రవీందర్, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పంకజ, చీఫ్ వెటర్నరీ అబ్దుల్ వకీల్, అసిస్టెంట్ అడ్వర్టైజ్మెంట్ అధికారి దుర్గాన భాను పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**

**-అమీర్‌పేట్‌లోని సామాజిక, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆకస్మిక తనిఖీ**



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల పట్ల డాక్టర్లు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం అమీర్‌పేట్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎమర్జెన్సీ క్యాజువాలిటీ, ఆపరేషన్ థియేటర్, లేబర్ రూమ్ లను పరిశీలించారు. ఆసుపత్రిని ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పేషంట్లకు సమయానికి నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. ఇక్కడ 50 పడకలు ఉన్నాయని, రోజుకు ఓపి 500 వరకు ఉంటుందని, దశలవారీగా 27 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారని అలాగే మెడిసిన్, సర్జరీ, గైనిక్, ఈఎన్టీ, రేడియాలజీ, ల్యాబ్ అందుబాటులో ఉన్నాయని సూపరిండెంట్ యం.కె రౌఫ్ వివరించారు. అలాగే పోస్ట్ ఆపరేషన్‌వార్డును పరిశీలించి తల్లి బిడ్డలకు అందుతున్న వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి లో ఏమైనా చిన్న చిన్న మరమ్మత్తులు ఉంటే సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ల్యాబ్ ను సందర్శించి ప్రభుత్వ మార్గదర్శకాలు లోబడి రోగులకు 57 రకాల టెస్టులు అందుతున్నాయని తెలుసుకున్నారు. డెంగ్యూ కేసులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యులు వచ్చిన రోగులకు టెస్టులు చేపట్టి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో ఎక్స్ రే, ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్, వివిధ రకాల టెస్టులు తప్పక చేపట్టాలని అలాగే నవజాత శిశు యూనిట్, చిన్నపిల్లల వార్డులను సందర్శించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. అనంతరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపి వివరాలు, డెంగీ కేసుల వివరాలు, అందుతున్న వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్ తో మాట్లాడారు. ఏఎన్ఎంలు పిహెచ్సి పరిధిలో ఫీవర్ సర్వేలు ఎక్కువగా చేపట్టాలని అలాగే ఈ ప్రాంతంలో ఎక్కువగా హాస్టల్స్ ఉండటంతో నిర్వాహకులతో హాస్టల్ గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ డాక్టర్. ఎస్ సూర్య శ్రీ , డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకటి, అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ హేమలత, సూపరిండెంట్ ఎంకే రౌఫ్, ఆర్ ఎం ఓ వినాయక్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న, ఎమ్మార్వో పద్మ సుందరి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రం శాస్త్ర సాంకేతిక రంగాలలో వేగంగా ముందుకు సాగుతోంది

**-గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ జాన్ కలరక్కల్ ఇతరులు

**నాచారం, జులై 28 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం శాస్త్ర సాంకేతిక రంగాలలో వేగంగా ముందుకు సాగుతోందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల (ఎల్ఎఫ్‌డిసి) ఫిజికల్ సైన్స్ విభాగం నిర్వహించిన జాతీయ సదస్సు ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ"ను తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ విశిష్ట ఘట్టాన్ని పురస్కరించుకొని కళాశాల డైరెక్టర్ బ్రదర్ జాన్ కలరక్కల్ సదస్సు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జయంతి రెడ్డి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు, విద్యార్థులకు ఈ సదస్సు ప్రాముఖ్యతను వివరించి దాని ముఖ్యాంశాలను, లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ విశిష్ట జీవిత ప్రయాణాన్ని ప్రతిబింబించే వీడియోను ప్రదర్శించారు. అనంతరం గవర్నర్ ఈ అంతర్జాతీయ సదస్సును అధికారికంగా ప్రారంభించి సదస్సు స్మరణికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి అవసరంపై వివరించారు. తెలంగాణ రాష్ట్రం శాస్త్ర సాంకేతిక రంగాలలో వేగంగా ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్తును నిర్మించడంలో విజ్ఞానం, ఆవిష్కరణల ప్రాధాన్యతను హైలైట్ చేస్తూ, అకడమిషియన్లు, పరిశోధకులు కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఉద్బోధించారు. ఈ సందర్భంలో గవర్నర్ మహాత్మా గాంధీ శాస్త్రం మానవత్వంతో కలిసినపుడే సమాజానికి అసలైన మేలును కలిగిస్తుంది" అనే సందేశాన్ని ప్రస్తావించారు. డాక్టర్ ఏ.పి.జే. అబ్దుల్ కలాంకు శాస్త్ర విజ్ఞానంపై ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని గుర్తు చేశారు. అబ్దుల్ కలాం ఎప్పటికి శాస్త్రాన్ని మానవత్వానికి ఒక గొప్ప వరంగా భావించేవారన్నారు. శాస్త్రం అనేది మానవాళి అభివృద్ధి సాధించడానికి ఒక శక్తివంతమైన సాధనం. శాస్త్ర విజ్ఞానాన్ని మానవ హితానికి వినియోగించాలే గానీ దుర్వినియోగం చేయరాదని హెచ్చరించారు. గవర్నర్‌ను ఎల్ఎఫ్‌డిసి డైరెక్టర్, ప్రిన్సిపల్, ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.

అనంతరం లిటిల్ ఫ్లవర్ కళాశాల కరస్పాండెంట్ బ్రదర్ అరుణ్ ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. భారత జాతీయ గీతాన్ని గౌరవంగా ఆలపిస్తూ ఈ చారిత్రక వేడుకకు ఘన ముగింపు పలికారు.

# భర్తను చంపడానికి భార్య స్కెచ్

**-చనిపోయాడని వదిలేసిన దుండగులు**

**-బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు**

**కొంపల్లి, జూలై 28, ప్రభాతవార్త**

కుటుంబంలో చెలరేగిన కలహాలు భర్తను చంపించాలి అనే వరకు దారితీసింది. అదృష్టవశాత్తు ఆ భర్త బతికిపోయాడు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం వనపర్తి జిల్లా పెద్దగూడెం తండాకు చెందిన ఎన్ రాందాస్ జ్యోతి అనే మహిళతో 2009లో వివాహం జరిగింది. గత మూడు సంవత్సరాలుగా కుటుంబంలో అపార్థాల కారణంగా విడివిడిగా జీవిస్తున్నారు. ఎన్ రాందాస్ భార్య ప్రగతి నగర్‌లో విడిగా నివసిస్తుంది. ఒక నెల క్రితం కుల పెద్దలు పంచాయతీ నిర్వహించి వారిద్దరి మధ్య గొడవలు సద్దుమణిగేటట్టు చేశారు. దీంతో ఇరువురు ప్రగతి నగర్ సమీపంలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నారు. ఈనెల 26న రాత్రి 11:45గంటలకు జ్యోతి వారి పొరిగింటివాడైనా నాయుడుకు ఫోన్ చేసి తనభర్తతో మాట్లాడి తాను రొట్టెలు అమ్ముకునే స్థలానికి రావాలని చెప్పింది. భర్త వద్ద సెల్‌ఫోన్ లేనికారణంగా పక్కింటి వారిని ఆమె సంప్రదించింది. దీంతో రాందాస్ నాయక్ తన భార్య రొట్టెలు అమ్మే దగ్గరికి వెళ్ళాడు. భర్త ఆమె వద్దకు రాగానే జ్యోతికి సన్నిహితుడైన గోపిని తోడుగా ఇచ్చి బీర్లు తీసుకురమ్మంటూ పంపింది. దీంతో వారిద్దరూ బాచుపల్లి ప్రధాన రోడ్‌లోని సాయి నగర్ కమాన్ వద్దనున్న వైన్ షాప్‌కు వెళ్లారు. అక్కడినుండి గోపి రామదాసుని తీసుకొని సమీపంలోని ఇందిరమ్మ కాలనీ ఖాళీ స్థలానికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఇద్దరు వ్యక్తులు వీరికోసమే ఎదురు చూస్తూ ఉన్నారు. రామదాసుకు బలవంతంగా బీర్లు తాగించి ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడికి పాల్పడ్డారు. దాడిలో రాళ్లు, బీరు బాటిల్లతో రాందాస్‌ను తీవ్రంగా గాయపరచడంతో అతను స్పృహ తప్పి పడిపోయాడు. దాడిలో రాందాస్ చనిపోయాడని భావించిన ముగ్గురు దుండగులు అక్కడి నుండి పారిపోయారు. దాడిలో రాందాస్‌కు తల, కళ్ళు, దవడ, ఛాతి, నడుము భాగాలలో తీవ్రమైన గాయాలు అయి తీవ్ర రక్తస్రావం జరిగింది. దాడిలో గాయపడిన రాందాస్ ఒక గంట తర్వాత స్పృహలోకి వచ్చి సాయి నగర్‌లోని శివాజీ నగర్‌లో ఉండే తన సోదరుడు ఇంటికి వెళ్ళాడు. అనంతరం బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భార్య ఆమె సన్నిహితులపై ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక విచారణ అనంతరం బాచుపల్లి పోలీసులు రామ్ దాస్‌పై జరిగిన దాడి ప్రదేశం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తున్నందున కేసును దుండిగలకు బదిలీ చేశారు.

## ఫ్రిజ్ ఓపెన్ చేస్తూ విద్యుదాఘాతానికి గురైన మహిళ

**అత్తాపూర్ జూలై28, ప్రభాతవార్త :** ఇంట్లో ఫ్రిజ్ ఓపెన్ చేస్తూ విద్యుదాఘాతానికి గురైన సంఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం....రాజేంద్రనగర్ పరిధిలోని ఎర్రబోడలో నివాసం ఉండే పద్మారావు కోడలు బల్లి లావణ్య (35) ఉదయం ఇంట్లో ఫ్రిజ్ ఓపెన్ చేస్తుండగా ఒకసారిగా విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. తల్లిని రక్షించే క్రమంలో కూతురు కూడా విద్యుత్ విద్యుదాఘానికి గురై అపస్మారక స్థితికి వెళ్లింది. లావణ్యను అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లాగా మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. అయితే లావణ్య భర్త నాలుగేళ్ల క్రిత చనిపోయాడు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఫ్రిజ్‌కు కరెంట్ తీగ తగిలి ఉండడంతో ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**మూసాపేట్, జూలై 28, ప్రభాతవార్త**

వేధింపులకు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడడంతో కూకట్‌పల్లి వెంకట్రావు నగర్‌లో విషాదం చోటుచేసుకుంది. బాచుపల్లిలోని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ తమ్ముడు శ్రీనివాస్ గౌడ్‌కు చెందిన సమ్మక్క సారక్క ప్రాజెక్టులో గత ఎనిమిది సంవత్సరాలుగా అంకెనపల్లి కుమార్ (28) అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. కాగా కోటి రూపాయల కుంభకోణం నేపథ్యంలో లెక్కలు చెప్పాలంటూ వేధింపులకు గురి చేయడంతో పాటు, తన వద్ద ఉన్న కారు, సెల్ ఫోన్ లాక్కోవడంతో కుమార్ మనస్థాపానికి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలో జరిగిన అవకతవకలకు కుమార్ కారణమని శ్రీనివాస్ గౌడ్ అతని అనుచరులు దాడికి పాల్పడ్డారని, బెదిరింపులు దాడులకు తట్టుకోలేక కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇక ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జైపాల్ రెడ్డికి భారతరత్న ఇవ్వాలి

**న-మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



జైపాల్ రెడ్డికి నివాళులు అర్పిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

**బేగంపేట్, జూలై 28, ప్రభాతవార్త**

తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన జైపాల్ రెడ్డి సేవలు మరవలేనివని, రాజకీయంలో ఉన్నత విలువలు పాటించిన జైపాల్ రెడ్డి జీవితం నేటి తరం నేతలకు ఆదర్శమని జైపాల్ రెడ్డికి భారతరత్న ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ స్వర్గీయ జైపాల్ రెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, నెక్లెస్ రోడ్‌లో స్ఫూర్తి స్థల్ వద్ద మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి పోరాటం వ్యక్తిత్వంపై ప్రచురించిన పుస్తకాన్ని కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజుతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా నేను ప్రజాప్రతినిధిగా కొనసాగడంలో జైపాల్ రెడ్డి ప్రేరణ ఎంతో ఉందన్నారు. వారికి భారత రత్న ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నాను అని మంత్రి అన్నారు.

# దేవుడి పేరుతో కబ్జాల పర్వం

**హైడ్రా ప్రజావాణికి 51 ఫిర్యాదులు**



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ ఎ.వి.రంగనాథ్

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, ప్రభుత్వ భూములు ఇలా ఏవైనా.., ఎక్కడైనా ఆక్రమణలకు పాల్పడాలన్నా.. కబ్జాలు చేయాలన్నా దేవుడిని రంగంలోకి దించేస్తున్నారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాలంటూ నివాసితులను నోరెత్తకుండా చేస్తున్నారు. మాలాంటి వారు ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తుంటే.. కుల, మత సంఘాలను వెనుకేసుకు వచ్చి దాడులకు పాల్పడుతున్నారు.. కాలనీలు, బస్తీలే కాదు.. కొత్తగా వచ్చిన గేటెడ్ కమ్యూనిటీలు, హెచ్ ఎండీఏ అనుమతి పొందిన లే ఔట్లలో కూడా ఇదే దందా కొనసాగుతోంది అని పలువురు కాలనీ, బస్తీవాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణిలో మొత్తం 51 ఫిర్యాదులందగా.. అందులో అధిక భాగం రహదారులు, నాలాలు ఆక్రమణలే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని ఆంజనేయ నగర్లో దాదాపు ఎకరం పార్కులో జెండా పాతి కొంతమంది కబ్జాకు పాల్పడుతుంటే.. సికింద్రాబాద్ చికోటీ గార్డెన్స్ పరిసరాల్లో గుడికి అనుసంధానంగా షెడ్డులు వేసి రోడ్డును ఆక్రమిస్తున్నవారు మరికొందరు. పటాన్ చెరు ప్రాంతంలో పార్కు స్థలంలో కొంతమేర గుడి కట్టి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. గూగుల్ మ్యాప్‌ద్వారా పరిస్థితిని ఫిర్యాదుదారులకు వివరించి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘాలు, సొసైటీలు ఖాళీ స్థలాలను ప్లాట్లుగా అమ్ముకుంటే వారిపైన చర్యలు తీసుకోవాలని పలువురు అసెట్ ప్రొటెక్షన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## ఘనంగా బోనాల ఉత్సవాలు



బోనాల ఉత్సవాలలో పాల్గొన్న గుర్రం పవన్‌కుమార్ గౌడ్

**సికింద్రాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** పద్మ రావు నగర్‌లోని రేణుక ఎల్లమ్మ దేవాలయం నిర్వాహకులు బోనాల ఉత్సవాలేను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో హరి చారీ, సాయిరాం చారీలు పాల్గొన్నారు.

### భారత సేవాశ్రమ్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాల పంపిణీ

**ముషీరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** భారత సేవాశ్రమ్ ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ పంకజ్ మెమోరియల్ ప్రభుత్వ పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారత సేవాశ్రమ్ నగర కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద, కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ పాల్గొని విద్యార్థులకు నోటుపుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ రచనశ్రీ మాట్లాడుతూ భారత్ సేవశ్రమ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని, ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భారత సేవాశ్రమం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పుస్తకాలు, షూస్ అందచేయటమే కాకుండా, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు కూడా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భారతసేవాశ్రమ్ సిబ్బందితో పాటు మాజీ కార్పోరేటర్ టి.రవీందర్, బీజేపీ నాయకులు జి.వెంకటేష్, పరిమళ్ కుమార్, ఎం.సి.మహేందర్‌బాబు, కుమార్‌గౌడ్, అనిల్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు సలంద్రి దిలీప్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి కేశవరాజు, బొల్ల రమేష్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షులు ఏ.ప్రభాకర్ గంగపుత్ర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### ఖాదర్‌బాగ్ మసీదుకు కొత్త ప్రహరీగోడ నిర్మాణం చేయాలి

#### ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ఖాదర్‌బాగ్ మస్జిద్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** గోల్నాక డివిజన్ పరిధిలోని ఖాదర్ బాగ్ మస్జిద్ వద్ద శిధిలంగా ఉన్న ప్రహరీ గోడను తక్షణమే తొలగించి, కొత్త ప్రహరీ గోడను నిర్మాణం చేయాలని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. సోమవారం ఆయన ఖాదర్ బాగ్ మస్జిద్‌ను సందర్శించి, అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై స్పందించిన ఆయన ప్రహరీ గోడ, ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు.

## పర్లి వైద్యనాథ్ జ్యోతిర్లింగ దర్శనం



కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ఆధ్వర్యంలో పర్లివైద్యనాథ్ జ్యోతిర్లింగ దర్శనం

**బేగంబజార్, జూలై 28ప్రభాతవార్త:** శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ఆధ్వర్యంలో డివిజన్‌కు చెందిన బిజెపి నాయకులు,కార్యకర్తలు,అభిమానులను తన సొంత డబ్బులతో పర్లివైద్యనాథ్ జ్యోతిర్లింగ్ దర్శనం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం నుంచి రెండు రోజుల క్రితం బయలు దేరిన సుమారు 40మంది కూడిన బిజెపి నాయకులు,కార్యకర్తలు,అభిమానులను తీసుకువెళ్లి పరమ శివున్ని దర్శనం చేయించడం జరిగిందన్నారు. కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌ను సన్మానించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## అర్చక,ఉద్యోగుల సంక్షేమ కోసం వెల్ఫేర్ ట్రస్ట్



గ్రాంటును అందచేస్తున్న కమిషనర్

**గన్‌ఫౌండ్రి, జూలై 28ప్రభాతవార్త:** ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఏ విధంగా అర్చకులకు, ఉద్యోగులకు ధూపదీప నైవేద్య అర్చకులకు బెనిఫిట్స్ ఏ విధంగా వస్తాయో అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందిస్తే అందుకు అనుగుణంగా అర్చక వెల్ఫేర్ ట్రస్ట్ నుండి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని దేవాదాయ ధర్మశాఖ రాష్ట్ర కమిషనర్ వెంకట్రావు హామి ఇచ్చారు.అర్చక వెల్ఫేర్ ట్రస్ట్ నుండి పదవి విరమణ పొందిన సూర్యపేట అన్నపూర్ణ సమేత విశ్వనాథ టెంపుల్ అర్చకులు వలివేటి వీర భద్రశర్మకు 8లక్షల రూపాయల గ్రాట్యూటి పత్రాలను,రామలింగేశ్వరస్వామి టెంపుల్‌లో స్వీపర్‌గా విధులను నిర్వహిస్తూ పదవి విరమణ పొందిన పాపమ్మకు 8లక్షల గ్రాట్యూటి,రామలింగేశ్వర స్వామి ఆలయంలో పని చేసే బాలకృష్ణకు ఆరోగ్య భీమా3లక్షలు,రఘుపతి మెడికల్ కింద15వేలు, సుహాన్ ఆశాయి అర్చక నీలకంఠేశ్వరస్వామి టెంపుల్ కూతురి పెళ్లికి 2లక్షల రూపాయలు అర్చక వెల్ఫేర్ ట్రస్ట్ నుండి విడుదల చేస్తు ప్రశంసా పత్రాలను అందచేశారు.ఈకార్యక్రమంలో తెలంగాణ అర్చక ఉద్యోగ జెఎసి ఛైర్మన్ గంగు ఉపేంద్రశర్మ,వేల్ఫేర్ బోర్డు సభ్యులుకాండూరి కృష్ణమాచారి,బక్కాపురం నారాయణస్వామి,అర్చక వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర అధికారి,అడిషనల్ కమీషర్‌శ్రీనివాస్‌రావు,డిసి కృష్ణప్రసాద్, అర్చక రాష్ట్ర జెఎసి కన్వీనర్ బద్రినారాయణచార్యులు, పరాశరం, రవీంద్రచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాన్ని తగుల బెట్టిన వ్యక్తి అరెస్ట్

**చార్మినార్, జూలై 28 ప్రభాతవార్త :** పాత కక్షలతో ఓ స్నేహితుడు తన స్నేహితుని ద్విచక్ర వాహనాన్ని తగుల బెట్టాడు.ఈ సంఘటలో వాహనాన్ని తగుల బెట్టిన వ్యక్తిని ఫలక్‌నుమా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి కథనం ప్రకారం..వట్టెపల్లి ప్రాంతానికి చెందిన మునావర్ ఖాన్,సమీర్ ఇద్దరు స్నేహితులు.స్నేహితులు ఇద్దరు పాతబస్తీలోని ఓ వస్త్రాల దుకాణంలో పని చేస్తున్నారు.వీరిద్దరి మధ్య గత కొంత కాలంగా వివాదాలు జరుగుతున్నాయి.పాత కక్షలను దృష్టిలో పెట్టుకున్న సమీర్ అతని స్నేహితుడైన వనావర్ ఖాన్ ద్వి చక్ర వాహనానికి నిప్పు పెట్టి తగుల బెట్టాడు.ఫలక్‌నుమా పోలీసులు సమీర్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును ఫలక్‌నుమా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశాంతంగా జరిగిన అడ్వకేట్ సొసైటీ డైరెక్టర్ ఎన్నికలు

### - డైరెక్టర్లుగా అప్పారావు, మల్లేష్, చెన్నారెడ్డి, ఇంద్రవర్ధనగౌడ్‌లు



**హైదరాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** అడ్వకేట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలలో డైరెక్టర్లుగా సిటీ సివిల్ కోర్టు బ్రాంచ్ నుండి అప్పారావు మక్కెన, నాంపల్లి క్రిమినల్ కోర్టు బ్రాంచ్ నుండి మల్లేష్ కర్కె, సికింద్రాబాద్ కోర్టు బ్రాంచ్ నుండి చెన్నారెడ్డి రావుల, రంగారెడ్డి జిల్లా కోర్టు బ్రాంచ్ నుండి జె.ఇంద్రవర్ధన గౌడ్‌లు ఎన్నికయ్యారు. ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో ఆదివారం అడ్వకేట్ సొసైటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు నుండి బ్రాంచ్ నుండి అప్పారావు మక్కెన, పి.రాంబాబు, టి.ఎస్.కె. త్రిలోక్‌రాజ్ పోటీ చేయగా తన సమీప ప్రత్యర్థి రాంబాబుపై అప్పారావు మక్కెనా విజయం సాధించారు. నాంపల్లి క్రిమినల్ కోర్టు బ్రాంచ్ నుండి బాలరాజ్.వి, బాల్‌రెడ్డి జిల్లెల్ల, మల్లేశ్ కరికే, ఎ.వెంకటరమణరెడ్డి, పోటీ చేయగా తన సమీప ప్రత్యర్థి బాల్‌రాజ్‌పై మల్లేశ్ కరికే విజయం పొందారు. సికింద్రాబాద్ కోర్టు బ్రాంచ్ నుండి చంద్రశేఖర్ తూము, చెన్నారెడ్డి రావుల, రమేష్ యారా, శ్రీనివాస్ చామల పోటీ చేయగా తన సమీప ప్రత్యర్థి రమేష్ యారా పై చెన్నారెడ్డి రావుల గెలుపొందారు. రంగారెడ్డి జిల్లా కోర్టు బ్రాంచ్ నుండి జె ఇంద్రవర్ధన్ గౌడ్, జగన్‌రెడ్డి నోముల, రవీందర్‌రావు మంత్రి పోటీలో ఉండగా రవీందర్ రావుపై జె.ఇంద్రవర్ధన్ గౌడ్ విజయం సాధించారు.

## సాంస్కృతిక సంస్థలతో తెలుగు సంస్కృతి పరిరక్షణ : బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి, జూలై 28 ప్రభాతవార్త:** సాంస్కృతిక సంస్థలు తో తెలుగు సంస్కృతి పరిరక్షణ సాధ్యమని,ఏభై నాలుగు ఏళ్ళు గా వంశీ సంస్థ ద్వారా వంశీ రామరాజు కళా రంగానికి చేస్తున్న సేవ విశేషం అని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ నిర్వహణ లో వంశీ రామరాజు సుధాదేవి దంపతులు వైవాహిక స్వర్ణోత్సవం ప్రముఖ వ్యాఖ్యాత్రి సుధామయి జన్మదినోత్సవం సందర్భంగా తెలుగు పాటకు పట్టాభిక్షేకం పేరిట సినీ సంగీత విభావరి జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బండారు దత్తాత్రేయ రామ రాజు దంపతులను సుధామయి నీ సత్కరించి మాట్లాడారు వంశీ రామరాజు విలువతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు వారు గర్వ పడే లాసమాజానికి మేలు చేస్తున్నారు అని ప్రశంసించారు సుధామయి వందల సినీ పాటల కార్యక్రమాలకు వ్యాఖ్యానం చేస్తూ వ్యాఖ్యాన శిరోమణి గా గుర్తింపు పొందారు అని అభినందించారు సంఖ్య శాస్త్ర వేత్త



వంశీ రామరాజు దంపతులను సత్కరిస్తున్న హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

దైవజ్ఞ శర్మ సినీ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ తమ అభినందన తెలిపారు ఈ సందర్భం గా సుధామయి వ్యాఖ్యానం లో జంట నగరాలలో ప్రముఖ గాయనీ గాయకులు మిత్ర బాల కామేశ్వర రావు వినోద్ బాబు గీతాంజలి వీణ ఫణి తదితరులు సినీ పాటలు మధురం గా ఆలపించారు సుంకర పల్లి శైలజ కార్యక్రమ పర్యవేక్షణ చేశారు.

## అటెన్షన్ డైవర్షన్ చేసి డబ్బును దొంగలించిన ముఠా అరెస్టు

**మెహిదీపట్నం, జూలై 28, ప్రభాతవార్త :** ఈ నెల 25వ తేదీన సాయి ప్రసాద్ రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా తీసుకొని 5 మంది నిందితులను సోమవారం పట్టుకొని రిమాండ్ కు తరలించిన సంఘటన టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం టోలిచౌకి పిఎస్ లో సౌత్ వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ కృష్ణ గౌడ్ వివరాలను వెల్లడించారు. టోలిచౌకి కి చెందిన సాయి ప్రసాద్ రెడ్డి క్రిప్టో కరెన్సీ కోసం ఆన్లైన్లో వెతుకుతుండగా ఆన్లైన్లోనే టోలిచౌకి ప్రాంతానికి చెందిన మజా అనే వ్యక్తి అతనికి పరిచయం అయ్యాడు. తన మిత్రుడి వద్ద 10 లక్షల రూపాయల విలువగల క్రిప్టో కరెన్సీ ఉన్నాయని నమ్మవలికి టోలిచౌకిలోని తన మిత్రుడి ఆఫీసుకి ఈనెల 25న తీసుకొని వచ్చాడు. అక్కడ బాధితుని వద్దనుండి 6,40,000/ నగదును తీసుకొని ఉడయించారు. అక్కడే ఉన్న మరో వ్యక్తి వద్ద నుండి కూడా 5 లక్షల రూపాయలు తీసుకొని వుడాయించారు. ఈ కేసుకు సంబంధించి ఐదు మంది జూ పార్క్ బహదూర్ పూరా ప్రాంతానికి చెందిన మహమ్మద్ బిలాల్ 28, హాకీంపేట టోలిచౌకి ప్రాంతానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఆజం అలియాస్ పర్వేజ్30, శంషాబాద్ మోహన మొహల్లా ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇక్బాల్ 30, టోలిచౌకి హకీంపేట ప్రాంతానికి



వివరాలను తెలుపుతున్న సౌత్ వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ కృష్ణ గౌడ్...

చెందిన మహమ్మద్ జమీల్ అమీద్ 25, టోలిచౌకి ఎండి లైన్స్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మాజ్ హుస్సేన్ 23 నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. కాగా మరో నలుగురు టోలిచౌకి ప్రాంతానికి చెందిన అబ్దుల్ షాహిద్, ముక్తార్ అహమ్మద్, మహమ్మద్ అఖిల్ నిందితులు పరారీలో ఉన్నట్లు సౌత్ వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ కృష్ణ గౌడ్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి నిందితులను పట్టుకున్న సీఐ రమేష్ నాయక్, డిఐ బాలరాజ్, ఎస్ఐ రాఘవేందర్ కు తగిన క్యాష్ ప్రైస్ ఇవ్వనున్నట్లు అడిషనల్ డీసీపీతో పాటు ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపారు.

### మేజర్ కవిత వాసుపల్లికి సత్కారం



భారత సైన్యంలో వైద్య అధికారిగా సేవలందిస్తున్నకవితా వసుపల్లిని సత్కరిస్తున్న హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి, జూలై 28 ప్రభాతవార్త:** బ్రహ్మపుత్ర నదిపై 1,040 కి.మీ రాఫ్టింగ్ యాత్రను పూర్తి చేసిన ఏకైక మహిళగా అసాధారణ విజయాన్ని సాధించి చరిత్ర సృష్టించిన భారత సైన్యంలో వైద్య అధికారిగా సేవలందిస్తున్న మేజర్ కవిత వాసుపల్లిని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం రామ్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆమె ఇప్పుడు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) ఎంట్రీని కలిగి ఉంది. ఆ బృందం కేవలం 28 రోజుల్లోనే 1,040 కి.మీ.ల దూరం ప్రయాణించి, ఇండోటిబెటన్ సరిహద్దుకు సమీపంలోని గెల్లింగ్ గ్రామం నుండి భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న హాట్సింగిమారి వరకు ప్రయాణించింది. సాహస క్రీడలు సేవా రంగంలో అసాధారణ ఘనత సాధించిన తర్వాత ఆమె బండారు దత్తాత్రేయను కలిశారు.

### వినియోగదారుల ఫిర్యాదులు సత్వరమే పరిష్కారం : ఎస్ఈ



నవాబ్ సాహెబ్‌కుంటలో విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఈ శ్రీ రామ్ మోహన్

**మైలార్‌దేవ్‌పల్లి, జూలై 28 ప్రభాతవార్త :** వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని ఎస్ఈ శ్రీ రామ్ మోహన్ అన్నారు. రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్ ఏఈ శ్రీనివాస్,శాస్త్రిపురం సెక్షన్ ఏఈ సుధాకర్ బాబుతో కలిసి ఆయన ఆషామాబాద్,క్రిస్టల్ టౌన్లలో పర్యటించి ట్విట్టర్లలో వినియోగదారుల నుంచి వచ్చిన విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీ రామన మోహన్ మాట్లాడుతూ వినియోగదారుల నుంచి వచ్చే సమస్యలను పరిష్కంచటానికి విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది బాధ్యతయుతంగా పని చేయాలని తెలిపారు.వట్టెపల్లిలో విద్యుత్ వినియోగదారుల నుంచి సమస్యలను డిఈ రత్నాకర్‌రావు అడిగి తెలుసుకునారు.డివిజనల్ ఇంజనీరు రత్నా కర రావు మాట్లాడుతూ టిజిఎస్‌పిటిసిఎల్ సిఎండి ముషా రఫ్ ఆదేశాల మేరకు ప్రజల సమస్యలను పరిష్కారం కోసం పని చేస్తున్నామని తెలియజేశారు.విద్యుత్ వినియోగదారులు సహకరించి విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు.

### వైభవంగా ముగిసిన కావడి యాత్ర



కావడి యాత్రలో పాల్గొన్న కావడి సంఘం ప్రతినిధులు

**చార్మినార్, జూలై 25 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీతో పాటు పలు ప్రాంతాలలో రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా కొనసాగిన భవ్య కావడి యాత్ర సోమవారంతో ముగిసింది.కావడి యాత్రకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ కావడి సేవా సంఘం అధ్యక్షులు మాంగేరాం తాయల్,ఘాన్సీ బజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులు నితేష్ అగర్వాల్,సంఘం ప్రతినిధులు పంకజ్ వర్మతో పాటు పలువురు పాల్గొన్నారు.కావడి యాత్ర విజయవంతం చేసినందుకు సంఘం అధ్యక్షులు మాంగేరాం తాయల్ ధన్యవాదాలు తెలిపారు.

### ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా : అద్దంకి దయాకర్



ప్రసంగిస్తున్న శాసనమండలి సభ్యుడు అద్దంకి దయాకర్

**చిక్కడపల్లి, జూలై 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి త్వరితగతిన ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసేలా ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని శాసనమండలి సభ్యుడు అద్దంకి దయాకర్ హామీ ఇచ్చారు. సోమవారం అశోకనగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగ యువతీ యువకులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పొట్లూరి పద్మజ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఇప్పటికే పెండింగ్‌లో ఉద్యోగాల భర్తీ అంశాన్ని కూడా త్వరితగతిన పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని, తాను గ్రంథాలయాలలో చదివి ఈ స్థాయికి చేరుకున్న వ్యక్తినని, విద్యార్థినీ విద్యార్థులఉ ప్రస్తావించే అంశాలు తనకూ తెలుసునని అన్నారు. గతంలో గ్రంథాలయానికి వచ్చిన సందర్భంలో విద్యార్థులు కొన్ని అంశాలు లేవనెత్తారని, వాటిని కూలంకశంగా పరిశీలించి ప్రభుత్వం వద్ద ప్రస్తావిస్తానన్నారు. జాబ్‌క్యాలెండర్ ప్రకటించి విద్యార్థినీ విద్యార్థులు ఎటువంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని, రేవంత్‌సర్కార్ నిరుద్యోగులకు ఉండే ప్రభుత్వం అని, గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా నిరుద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు.

## తడి,పొడి చెత్తను వేరుచేసి ఆటోల్లో వేయండి : కమిషనర్ శరత్‌చంద్ర

**నార్సింగి, జూలై 28 ప్రభాతవార్త :** ప్రజలంతా తమ ఇళ్లలోనే తడి,పొడి చెత్తను వేరు చేసి ఆటోలలో వేయాలని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో మాధవీనగర్ కాలనీలో కమీషనర్ ప్రజలకు తడి,పొడి చెత్త వేరు చేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా తమ ఇళ్లు, ఇంటి పరిసరాలలో చెత్త, నీరు నిలువ ఉండకుండా చూడాలని తెలిపారు. చెత్త, నీరు ఉన్నచోటనే వ్యాధి కారకాలైన దోమలు, ఈగలు వ్యాప్తిచెంది మలేరియా, టైఫాయిడ్, బోధకాలు, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, ఆసనాలు, యోగ, ప్రాణాయామం, ధ్యానం చేస్తూ పరిశుభ్రతను పాటించే వారు 90.శాతం వ్యాధులకు దూరం అవుతారన్నారు. కార్పోరేషన్ పరిధిలోని ప్రజలంతా పరిశుభ్రతను పాటించాలని కమీషనర్ శరత్‌చంద్ర సూచించారు. అలాగే నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.ఓ శివ కుమార్, డిఇఇ యాదయ్య, ఏఈఈ రాజ్ కుమార్, ఎస్ఐజి వెంకట్‌రెడ్డి, టిఎంసి శ్రీలత, వార్డు ఆఫీసర్ అహ్మద్, బిల్ కలెక్టర్లు నరేందర్‌రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.



## 17,18 తేదీలలో మైనార్టీలపై దాడులను అరికట్టాలని చలో ఢిల్లీ

**సైఫాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా క్రైస్తవులు, దళితులపైన జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ 'చలో ఢిల్లీ' పేరిట ఆగస్టు 17, 18 తేదీలలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని భారతీయ దళిత మైనార్టీ విమోచన సమితి ప్రకటించింది. ముఖ్యంగా ఛత్తీస్‌ఘడ్‌లో క్రైస్తవులపైన జరుగుతున్న దాడులన అరికట్టి తగిన రక్షణ కల్పించాలని సమితి ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షుడు గోల్లపల్లి దయానందరావు, రాష్ట్ర అధ్యక్షుడు అశ్వీరాదం, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ నాథన్, వివిధ పార్టీల నేతలు విజిఆర్ నారగోని, శ్రీనివాస్‌యాదవ్, మల్లంపాటి రమేష్ తదితరులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 11 ఏళ్ళలో మైనార్టీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని, రక్షణ లేకుండా





సమావేశంలో మాట్లాడుతున్న నాథన్

పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌ల విషయంలో మైనార్టీలకు అన్యాయం జరుగుతున్నదని, అందువల్ల రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచి అధునిక పద్దతుల్లో రిజర్వేషన్‌లు కల్పించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో మైనార్టీల సమస్యలపై ప్రధానిని కలిసి వినతి పత్రాన్ని సమర్పిస్తామన్నారు.

### హెపటైటిస్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి

#### ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి

**ముషీరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** హెపటైటిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ప్రపంచ హెపటైటిస్ డే సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ హెపటైటిస్ అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే అంటువ్యాధుల సమూహామని, దీని బారిన పడిన వారు చికిత్స చేయించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక కాలేయ వ్యాధి, సిర్రోసిస్ మరియు కాలేయ క్యాన్సర్‌కు కూడా దారితీసే ప్రమాదం ఉందని అన్నారు. హెపటైటిస్‌లో హెపటైటిస్ ఏ, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, హెపటైటిస్ డి, హెపటైటిస్ ఈ అనే రకాలు ఉంటాయని, ఇవి ఒక ప్రత్యేకమైన వైరస్ వల్ల వస్తుందని తెలిపారు. హెపటైటిస్‌ను గుర్తించటానికి రెగ్యులర్ స్క్రీనింగ్ మరియు రక్త పరీక్షల ద్వారా, లివర్ ఫంక్షన్ పరీక్షల ద్వారా నిర్ధారణ చేయవచ్చునని అన్నారు. కలుషిత ఆహారం, కలుషిత నీరు, హెపటైటిస్ సోకిన వ్యక్తితో సన్నిహితంగా ఉండటం, సూదులు ఇతర డ్రగ్ ఇంజెక్షన్ పరికరాల ద్వారా ఒకరి నుండి మరొకరికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉందని, అదే విధంగా ప్రసవ సమయంలో తల్లి నుండి బిడ్డకు కూడా హెపటైటిస్ సంక్రమించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొన్ని జాగ్రత్తలు పాటించటం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చునని తెలిపారు. సురక్షిత సెక్స్, ఒకరు వాడిన సూదులు, సిరంజిలు మరొకరు వాడకుండా ఉండటం, పారిశుద్ధ్యం తక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లినప్పుడు కలుషిత ఆహారం, కలుషిత నీరు తీసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని, పచ్చి లేదా తక్కువ ఉడికించిన సీఫుడ్ మరియు సెల్ఫిష్‌లను తీసుకోకుండా ఉండాలని సూచించారు. హెపటైటిస్ బారిన పడిన వారు సకాలంలో చికిత్స చేయించుకోవటం ద్వారా వ్యాధి నుండి బయటపడవచ్చునని తెలిపారు.

## అగ్రస్థానంలో మహమ్మద్ రిజ్వాన్

### -యూత్ ఓపెన్ రెగెట్టా టోర్నీ



టాప్‌లో నిలిచిన మహ్మద్ రిజ్వాన్

**హైదరాబాద్, జూలై 28,ప్రభాతవార్త:** హుస్సేన్ సాగర్ వేదికగా జరుగుతున్న సికింద్రాబాద్ క్లబ్ యూత్ ఓపెన్ రెగెట్టా చాంపియన్షిప్ ఆసక్తికరంగా సాగుతున్నది. పోటీల మూడో రోజు సోమవారం వివిధ విభాగాల్లో సెయిలర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఆప్టిమిస్టిక్ మెయిన్ ఫ్లీట్లో ఎన్వోఎస్సీకి చెందిన మహమ్మద్ రిజ్వాన్ ఆరు రేసుల్లో 10.0 స్కోరుతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇదే కేటగిరీలో బొంగూరు బన్నీ(టీఎస్సీ), కృష్ణ వెంకటాచలం (ఆర్ఎమ్ఎస్వీ) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. ఉదయం పూట తీవ్రమైన గాలులతో సెయిలర్లు సతమతం కాగా, మధ్యాహ్నం నాటికి కుదురుకోవడంతో సెయిలర్లు తమ రేసింగ్‌కు పదునుపెట్టారు. మిగతా విభాగాలు ఐఎల్సీఏ 4 డివిజన్లో రమాకాంత్ టాప్లో ఉండగా, బాలికల కేటగిరీలో ఆస్థా పాండే, ఆప్టిమిస్టిక్ గ్రీన్ ఫ్లీట్లో యువరాజ్, బాలికల్లో సోనియా అగ్రస్థానంలో దూసుకెళుతున్నారు. బాలికల ఆప్టిమిస్టిక్ విభాగంలో శ్రింగారి రాయ్ (ఎస్ఎస్సీ) ఓవరాల్‌గాతొమ్మిదో స్థానంలో ఉంది.

### పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు ముందుకు రావాలి



**నార్సింగి, జూలై 28 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు దాతలు మరింత మంది ముందుకు రావాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎస్.ఎ గ్లోబల్ సంస్థ ఆధ్వర్యంలో హైదర్షాకోట్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సర్కారు బడుల్లో చదువుతున్న వారంతా నిరుపేదల బిడ్డలేనని తెలిపారు. వీరికి చదువుకోవాలన్న ఆసక్తి, ఆశ ఉన్నా ఆర్థిక ఇబ్బందుల కారణంగా మధ్యలోనే చదువులకు దూరం అవుతున్నారన్నారు. ఇలాంటి వారికి సమాజంలో ఆర్థికంగా స్థిరపడ్డ వారు సహకారం అందించి వీరి జీవితంలో వెలుగులు నింపాలని సూచించారు. ప్రభుత్వం పాఠశాలల పట్టిష్టానికి, మెరుగైన విద్యా బోధనకు తీవ్రంగా శ్రమిస్తుందని, ప్రభుత్వకు తోడుగా దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతిని దులు ప్రభుత్వ బడుల్లోని చిన్నారులకు చేయూతనందిస్తే మెరు గైన ఫలితాలు వస్తాయన్నారు. ఇప్పటికే సర్కారు బడుల్లోని ప దో తరగతి ఉత్తీర్ణతా శాతంను పరిశీలిస్తే కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వస్తున్నాయన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాజేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ముషీరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనంపై కుటుంబ సభ్యులు నలుగురు కలసి వెళ్తూ ఉండగా ప్రమాదానికి గురైౖ వాహనం నడుపుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. దోమలగూడ ఎస్ఐ కే.శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బి.అశోక్(38) అనే వ్యక్తి రాంనగర్‌లో నివసిస్తూ, నెక్లెస్ రోడ్డులో క్యాంటిన్ నడుపుతూ ఉండేవాడు. సోమవారం సాయంత్రం రాంనగర్ నుండి నెక్లెస్ రోడ్డులోని క్యాంటిన్‌కు భార్య లావణ్య(30), చెల్లెలు కవిత (31), కూతురు (6) తో కలసి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. స్టీల్ బ్రిడ్జ్ నుండి దిగుతున్న క్రమంలో బండి అదుపుతప్పి డివైడర్‌ను గుద్దుకుని క్రింద పడిపోవటంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా కుటుంబ సభ్యులు గాయాలతో బయట పడ్డారు. సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, అశోక్ మృతదేహాన్ని గాంధీ హాస్పటల్‌కు తరలించి, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం శ్రీకర హాస్పటల్‌కు తరలించారు. అశోక్ కుమార్తెకు కూడా తలకు బలమైన గాయాలయ్యాయని, ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎక్కువ మందితో పరిమితికి మించి ద్విచక్రవాహనంపై ప్రయాణమే ప్రమాదానికి కారణం కావచ్చని, అశోక్ హెల్మెట్ పెట్టుకున్నప్పటికీ, దాని క్లిప్ పెట్టుకోకపోవటం వల్ల హెల్మెట్ క్రింద పడి తలకు బలమైన గాయాలు అయినట్లు భావిస్తున్నారు.

### భవనంపై నుంచి జారి పడి ప్లంబర్ మృతి

**చార్మినార్, జూలై 28 ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు భవనంపై నుంచి జారి పడి ఓ ప్లంబర్ మృతి చెందిన సంఘటన బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం..పాతబస్తీ జహనుమా ప్రాంతానికి చెందిన మహ్మద్ చాంద్ (34) వృత్తి రీత్యా ప్లంబర్.ప్లంబర్ పని చేస్తూ భార్య,పిల్లలను పోషిస్తున్నాడు.కాగా సోమవారం ఉదయం కిషన్‌బాగ్‌లోని చిరాగ్‌అలీనగర్‌లో ప్లంబర్ పని కోసం మహ్మద్ చాంద్ వెళ్లాడు.భవనం మొదటి అంతస్థు మీదకు ఎక్కి మహ్మద్ చాంద్ పైపు పనులు చేస్తున్నాడు.తుప్పు పట్టి ఉన్న పైపు లైన్ విరిగి పోవటంతో అదుపు తప్పి మహ్మద్ చాంద్ భవనం మీద నుంచి కిందకు జారి పడి పోయాడు. ఈ సంఘనటలో మహ్మద్ చాంద్ తలకు తీవ్ర గాయలయ్యాయి.బహదూర్‌పుర లో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా అప్పటికే ప్లంబర్ మహ్మద్ చాంద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం చాంద్ మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.చని పోయిన మహ్మద్ చాంద్‌కు భార్య,పిల్లలు కలరు.ఈ కేసు ను బహదూర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆగస్టు 23,24 తేదీల్లో 'ఎన్ఎండిసి హైదరాబాద్ మారథాన్'



టీషర్ట్, మెడల్స్ ఆవిష్కరిస్తున్న నిఖత్ జరీన్

**హైదరాబాద్, జూలై 28, ప్రభాతవార్త:** ఎన్ఎండిసి హైదరాబాద్ మారథాన్ 2025ను ఆగస్టు 23,23 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సోమవారం బంజారాహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో బాక్సర్ నికత్‌జరీన్ చేతుల మీదుగా టీషర్ట్, మెడల్స్‌ను ఆవిష్కరించారు. ఆగస్టు 23న శనివారం ఉదయం 7గంటలకు హైటెక్స్‌లో 5కెరన్, ఆగస్టు 24ఆదివారం ఫుల్ మారథాన్‌ను ఉదయం 4.30కి పీపుల్స్‌ప్లాజలో ప్రారంభమై గచ్చిబౌలి స్టేడియం వద్ద ముగుస్తుందని తెలిపారు. ఈసారి దాదాపు 28వేలమంది ఈరేస్‌లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎన్ఎండిసి ఈడీ సంజీవ్ సహి, ఫస్ట్‌బ్యాంక్ తెలంగాణ రీజనల్ హెడ్ శ్రీనివాస్‌గుట్టి, రైస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా పాల్గొన్నారు.

### పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ మహేష్ బాబు సంస్మరణ సభ



పోలీస్ ట్రైనింగ్ సెంటండీఎస్పీ మహేష్ బాబు సంస్మరణ సభలో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, జూలై 28 ప్రభాతవార్త:** ఇటీవల మృతి చెందిన హుజూరాబాద్ ఏసీపీ మాధవి భర్త, పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ మహేష్ బాబు సంస్మరణ సభలో సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొన్నారు. మహేష్‌బాబు మంచి అధికారిగా పేరును సంపాదించారని ముఠాగోపాల్ అన్నారు. ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించాల్సిన ఆయన అనతికాలంలోనే మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ సభలో బిఆర్ఎస్ సీనియర్ నేత ముఠానరేశ్, గడ్డమీది శ్రీనివాస్, బంగారి ఉమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి : డీసీపీ చైతన్యకుమార్



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న డిసిపి చైతన్యకుమార్ చిత్రంలో రామచందర్ తదితరులు

**మలక్ పేట ,జూలై 28, ప్రభాతవార్త:** చంచల్ గూడ పిల్లి గుడిసెలు టు బిహెచ్కె డిగ్నిటీ హౌసింగ్ కాలనీ లోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం లో జరిగిన బోనాల జాతరలో సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి చైతన్య కుమార్ పాల్గొని పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణా రవీందర్ రెడ్డి, జలమండలి సీజీఎం వినోద్ భార్గవ్, మీరాలం మండి దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్యతో పాటు మల్యాల మధుసూదన్ యాదవ్, అనంత్, హాన్స్ రాజ్, బుల్లెట్ శ్రీధర్, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షులు డాక్టర్ నాగనాథ్ మాశెట్టి, బీజేపీ సీనియర్ నాయకులు గాదెపాగా బాల కృష్ణ, బోసు పల్లి ప్రతాప్, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు నిరంజన్ యాదవ్, మాదన్నపేట్ ఇన్స్ పెక్టర్ ఆంజనేయులు, నిర్వాహకులు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంకులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**మల్కాజిగిరి జూలై28,ప్రభాతవార్త :** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని హిల్ టాప్ కాలనీలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని మల్కాజ్గిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని హిల్ టాప్ కాలనీలో కాలనీవాసులు పెద్ద కొంతకాలంగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మూడున్నర లక్షల రూపాయల వ్యయంతో ఎమ్మెల్యే తన సొంత నిధులతో పవర్ బోరు నీటి స్టోరేజీ కోసం ఐదు వాటర్ ట్యాంకులను ఇటీవల నిర్మించారు నిర్మించిన వాటర్ ట్యాంకులను సోమవారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముల వారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజిగిరిలో దశాబ్ద కాలంగా నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, ప్రేమ్ కుమార్, అశోక్ యాదవ్ తదితరులున్నారు

## ఘనంగా ఆండాళ్ తిరునక్షత్ర మహోత్సవం వేడుకలు

**మల్కాజిగిరి జూలై28,ప్రభాతవార్త :** మల్కాజిగిరిలోని ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర మహోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. పూర్వఫల్గుణి నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పాలంకరణలు జరిపారు. వైష్ణవ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన 12 మంది ఆళ్వార్లలో ఆండాళ్ తల్లి విశిష్ట స్థానం దక్కించుకున్నారు. లక్ష్మీదేవి యొక్క అంశంగా పూజలందుకునే ఆండాళ్ తల్లి జన్మనక్షత్రమైన పూర్వఫల్గుణి సందర్భంగా విశేష ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం పుష్పాలతో అందంగా అలంకరించగా, పండుగ వాతావరణాన్ని తలపించేలా జరిగింది. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఆండాళ్ అమ్మవారి దర్శనంతో భక్తి పరవశంలో మునిగిపోయారు. అమ్మవారి ఆశీస్సులు పొందిన భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

**:కళాశాల కరస్పాండెంట్ జూలకంటి శ్రీధర్ రెడ్డి**



కళాశాల విద్యార్థులతో కలిసి బోనాల ఉత్సవాలను నిర్వహిస్తున్న కళాశాల కరస్పాండెంట్ జూలకంటి శ్రీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తదితరులు

**మలక్ పేట, జూలై 28, ప్రభాతవార్త:** బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేకత నిలుస్తాయని కళాశాల కరస్పాండెంట్ జూలకంటి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ లోని సాకేత జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో కళాశాల విద్యార్థులు బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడంతో విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత గురించి తెలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు పలు ఉత్సవాలను కళాశాలలో నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, రాజేష్ లతోపాటు పలు అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోనాల పండుగ



మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న గౌడ్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ చంద్రకాంత్ గౌడ్

**వనస్థలిపురం జూలై.28.ప్రభాతవార్త :** బి.యన్. రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ బతుకమ్మ కుంట సమీపంలోలో గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు ఆలయకమిటి చైర్మన్ ముద్దగౌని చంద్రకాంత్ గౌడ్,సాహెబ్ నగర్ గ్రామ పెద్దల సహకారం తో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, టి. పి. సి.సి. ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్,మాజీ కార్పొరేటర్ లు ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్ గౌడ, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డి,బి.జె.పి. రాష్ట్ర నాయకులు సామ రంగా రెడ్డి,వనస్థలిపురం ఇన్స్పెక్టర్ మహేష్ గౌడ్ లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు.



నాగోల్‌లో జరిగిన పలారం బండి ఊరేగింపులో పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తను సన్మానిస్తున్న రంజిత్‌గౌడ్

# మల్కాజ్‌గిరి సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు

**-చోద్యం చూస్తున్న అధికారులు !**
**-ప్రభుత్వ అదాయానికి భారీగా గండి**
**-నేరేడ్‌మెట్ డివిజన్‌లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు**





**నేరెడ్ మెట్,జూలై 28,ప్రభాతవార్త :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. "మేడ మీద మేడ అనుమతులు ఏడ" అన్న చందం గా.. కళ్లకు స్పష్టంగా కనిపిస్తున్న అనుమతులు లేని నిర్మాణాలను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలో అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా, అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న అక్రమ నిర్మాణాలకు మల్కాజ్‌గిరి సర్కిల్ ఇప్పుడు అడ్డాగా మారిందనే అపవాదు మూటగట్టుకుంటోంది. గౌతమ్ నగర్ డివిజన్ లోని మధుసూదన్ నగర్, రాజా నగర్, మీర్జాలాగూడ తదితర ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా అంతస్తుల మీద అంతస్తులు నిర్మిస్తున్నా, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కిందిస్థాయి సిబ్బంది నుండి ఉన్నతాధికారుల వరకు అందరూ చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక పెద్ద ఎత్తున ఖిచేతులు తడపడంఖీ జరుగుతోందని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను, భవన నిర్మాణ చట్టాలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న ఈ అక్రమ నిర్మాణాలు భవిష్యత్తులో ప్రజల భద్రతకు పెను ప్రమాదంగా మారే అవకాశం పలువురు హెచ్చరిస్తున్నారు. స్థానిక కార్పొరేటర్లు, నాయకులు కూడా ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా, అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఈ అక్రమ నిర్మాణాల వల్ల డ్రైనేజీ వ్యవస్థ, రహదారులు, తాగునీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అధికారులు తక్షణమే స్పందించి అనుమతులు లేని నిర్మాణాలపై తగినచర్యలు తీసుకోని బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బంజారా సేవాలాల్ మహారాజ్ మేరమ ,యాడిదైవం బోనాల పండుగ సంబరాలు

**తుర్కయంజాల్ జూలై 28 ప్రభాతవార్త :** తెలంగాణ బంజార సహోదరులు శ్రావణమాసం పురస్కరించుకొని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డు ఇంద్రమ్మ కాలనీ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో సాంప్రదాయ పండుగను సంబురంగా కొనసాగించామని ఇంద్రమ్మ కాలనీ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాట్రావత్ రాజు నాయక్ పేర్కొన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ ఇంద్రమ్మ కాలనీ బంజార పండుగ సందర్భంగా సేవాలాల్ మేరమ యాడిదైవం ఘనంగా అమ్మవారికి బోనలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించుకొని బంజారా సోదరులు ఒకరి నొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీ బంజార వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కాట్రావత్ రాజు నాయక్ మాట్లాడుతూ.. బంజారాలకు ఎన్నో దశాబ్దాల నుండి వస్తున్నటు వంటి సాంప్రదాయ పండుగలను బంజార సోదరులు అందరు ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. తద్వారా వర్షం అనుకూలంగా కురిసి పంటలు సంమృద్ధిగా పండాలని ఊరు, వాడ శ్రేయస్సు కోసం పూజించిస్తామని చిన్న పెద్ద అందరు కలిసి సాంప్రదాయా డబ్బు వాయిద్యాలతో నృత్యం చేస్తూ ఆటపాటలతో సంతోషంగా జరుపుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మూడవత్ రాందాస్ నాయక్, రాము నాయక్, సంతోష్ నాయక్, హనుమ నాయక్,కుమార్, పెంటు గోవర్ధన్ నాయక్, మోహన్ నాయక్, శ్రీను నాయక్, మోతిలాల్ నాయక్, తావు నాయక్, బలవంత్ నాయక్, నరసింహ నాయక్, రమేష్ నాయక్, సీత్యా నాయక్,సంఘ సభ్యులందరు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో శ్రీప్రసన్నమహాకాళి పుష్కర బ్రహ్మోత్సవాలు

**ఎల్.బి.నగర్, జులై 28 ప్రభాతవార్త:** అమ్మవారిని తలచి కొలిస్తే అన్ని కష్టాలు తొలగిపోతాయని చండి ఉపాసకులు బ్రహ్మశ్రీ పాలెం మనోహర్‌శర్మ పేర్కొన్నారు. కొత్తపేట గ్రామంలోని శ్రీప్రసన్నమహాకాళి అమ్మవారి పుష్కర వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమాలు గత రెండు రోజులుగా పాలెం మనోహర శర్మ పౌరోహిత్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్థాపిత దేవతార్చన, మూలమంత్ర ఆహ్వనములు, వనదుర్గ, బల, అతిబల, మహాబల, భగలాముఖి, ప్రత్యంగిరా, కృపాంగిరా, మంత్రమూల పారాయణాలు, శ్రీకుబేర పాశుపత రుద్రాభిషేకము, రుద్రఆహ్వనము, దేవతార్చన, శ్రీచక్ర నవావరణ మహాపూజ, అష్టాంగ సేవలు తదితర పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఉత్సవాలలో పాల్గొన్న వందలాదిమంది భక్తులకు ఈ సందర్భంగా అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ వజీర్ ప్రకాష్‌గౌడ్, డైరెక్టర్ జైహింద్‌గౌడ్, ప్రధానఅర్చకుడు మనోజ్‌శర్మ, లైన్స్‌క్లబ్ హెల్త్‌క్యాంప్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా, విటల్‌శర్మ, వజీర్ ప్రవీణ్‌గౌడ్, రాచర్ల రమేష్, ప్రసాద్, అశోక్‌జైన్, కృష్ణారెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మశ్రీ పాలెం మనోహర్‌శర్మ నేతృత్వంలో పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

## ప్రజా సంక్షేమం నిరంతర ప్రక్రియ.. ప్రభుత్వాలు మారినా ఆగకూడదు : సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 28 ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమం నిరంతర ప్రక్రియ అనీ ప్రభుత్వాలు మారినా పేదల సంక్షేమం ఆగకూడదనీ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ ప్రజాభవన్‌లో సోమవారం నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సబితారెడ్డి టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ కమీషనర్ సరస్వతిలతో కలిసి రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు నియోజకవర్గంలోని బాలాపూర్ మండల పరిధి కిందకు వచ్చే బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీలకు సంబంధించిన మొత్తం 1322 నూతన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ చొరవతో పేదల కోసం 6.42 లక్షల రేషన్‌కార్డులను రాష్ట్రవ్యాప్తంగా పేదలకు అందించిదని గుర్తు చేశారు. ఒక్క ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే 90 వేల కార్డులను జారీ చేసిందని ఆమె వెల్లడించారు. ప్రభుత్వం మారినా పేదల సంక్షేమం మాత్రం కొనసాగుతూనే ఉండాలని ఆమె అన్నారు. రేషన్‌కార్డులకు సంబంధించిన సాంకేతిక లోపాలను సరిదిద్దాలనీ మీ సేవా కేంద్రాల చుట్టూ ప్రజలు తిరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలు తీసుకొని రేషన్‌కార్డుల సాంకేతిక సమస్యలు, మార్పులు, చేర్పులు తదితర సమస్యలను పరిష్కరించాలని ఆమె సూచించారు. ఇంకా ఈ సమావేశంలో టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ సొసైటీ పిఎసి చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, డిటి మణిపాల్‌రెడ్డి, స్థానిక బడంగ్‌పేట్ మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సుక్క బాలరాజ్, అల్మాస్‌గూడ మాజీ సర్పంచ్‌లు రామిడి రాంరెడ్డి, ముత్యాల కృష్ణ, జల్‌పల్లి మాజీ ఎంపిటిసి యాంజాల జనార్ధన్, వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు నవారు మల్లారెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, వల్లపు సుభాన్ యాదవ్, అర్కల కామేష్‌రెడ్డి, ఎర్రబట్టు శ్రీనివాసరాజు, బొర్ర మాధవరెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, మల్గారి శ్రీధర్‌రెడ్డి, గట్టు మహిపాల్, కోటగిరి జంగయ్య, సామ వరుణ్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి: చిత్రంలో టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తదితరులు

## బీరప్పగడ్డలో శ్రీనల్లపోచమ్మ ఆలయ ముఖద్వారా ఏర్పాటు కోసం శంకుస్థాపన

**నాచారం, జులై 28 ప్రభాతవార్త :** చిల్కానగర్ డివిజన్‌లోని బీరప్పగడ్డ బొమ్మల బస్తిలో ఉన్న శ్రీశ్రీనల్ల పోచమ్మ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో ముఖ ద్వారం ఏర్పాటు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ హాజరై పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీని నెరవేర్చుటకై అమ్మవారి ఆశీస్సులతో బొమ్మల బస్తీలోని శ్రీశ్రీనల్ల పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేయుట మహాభాగ్యం కలిగినందుకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ముఖద్వారాన్ని పవిత్రమైన ముహూర్తంలో పూజా కార్యక్రమాలతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నల్ల పోచమ్మ ఆలయాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేస్తానని బస్తి వాసులకు ఎలక్షన్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటానని,అమ్మవారి ఆశీస్సులు బస్తీ వాసులందరూ పొందే విధంగా ఆలయ నిర్మాణం తొందరగా పూర్తి చేస్తానని చెప్పారు. ఆగస్టు నెలలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో నూతన ఆలయా విగ్రహ ప్రతిష్ట మరియు ప్రారంభోత్సవం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ పుర ప్రముఖులు నిదానకవి శ్రీరాములు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోకొండ జగన్, బింగి శ్రీనివాస్, బాలు, మార్క శీను గణేష్, బస్తీ వాసులు బొమ్మల జంగయ్య, సురేష్, అర్చకులు కన్నయ్య పంతులు బస్తి వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ముఖ ద్వార పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పోరేటర్ బన్నాల

## పేద విద్యార్థుల భవిష్యత్తుకు ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీ కృషి : పిఆర్‌టియు నాయకులు



మలక్ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ దంపతులను సన్మానిస్తున్న పిఆర్టియు నాయకులు

**మలక్ పేట ,జూలై 28, ప్రభాతవార్త:** మలక్ పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ ఉద్యోగ విరమణ అభినందన సభకు పి ఆర్ టి యు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టి తిరుపతి రెడ్డి తదితరులు హాజరై విజయ లక్ష్మీ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, పేద పిల్లల అభ్యున్నతికి ఎంతో సేవ చేశారని ఆమె సేవలను కొనియాడారు. విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేయడం జరిగిందని తెలిపారు. మలక్ పేట లోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించడం కోసం విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు సైదాబాద్ మండల అధ్యక్షులు బి.అంజనేశ్వర్ రావు , జిల్లా ఉపాధ్యక్షులు మందాడి వెంకటరెడ్డి, శ్రీవాణి, ప్రద్యుమ్న రెడ్డి నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

### మలక్ పేట మటన్ మార్కెట్‌లో సులబ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలి

**మలక్ పేట ,జూలై 28, ప్రభాతవార్త:** మలక్ పేట మటన్ మార్కెట్లో ప్రజల సౌకర్యార్థం సులబ్ కాంప్లెక్స్ ను నిర్మించాలని గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్, గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు జోనల్ కమిషనర్, ఓల్డ్ మలక్ పేట ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు సైఫుద్దీన్ షఫీలకు వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మటన్ మార్కెట్ లో సులబ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో సులబ్ కాంప్లెక్స్ ఉండేదని, నూతన మటన్ మార్కెట్ భవన నిర్మిస్తున్న సమయంలో సులబ్ కాంప్లెక్స్ ను కూల్చివేయడం జరిగిందని వివరించారు. సులబ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందుల గురవుతున్నది వెంటనే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెగిరెడ్డి మదన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్లమ్మ దేవి బోనాల పండుగ



శ్రీ ఎల్లమ్మ దేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి,ఆలయ చైర్మన్ వనిపల్లి

**వనస్థలిపురం జూలై.28.ప్రభాతవార్త :** వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలో గల శ్రీ ఎల్లమ్మ దేవి ఆలయంలో బోనాల పండుగను ఆలయ కమిటీ చైర్మన్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్, అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగా రెడ్డి,కార్పొరేటర్ లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్ళెం నవ జీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, ఎల్. బి. నగర్ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి నివాసం నుండి ఫలహారం బండి అంగరంగ వైభవంగా,పోతరాజుల విన్యాసాలతో బయలుదేరి అమ్మవారి ఆలయానికి చేరుకుంది.భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

### మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కందుకూరి సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తోట కృష్ణ దొర, కోశాధికారిగా సామ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గూడ శివ కుమార్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని త్వరలోనే నియమించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ జైపాల్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు రఘునందన్‌రెడ్డి, నర్సింహాచారి, సుఖజీవన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : కార్పొరేటర్



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 28 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మాధవనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ మాధవనగర్‌లో మ్యాన్‌హోల్స్ నుండి మురుగునీరు రోడ్లపైకి పారుతుందని, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండి వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్లుఎస్ అండ్ ఎస్‌బి అధికారులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ల పదవీ కాలం ముగిసిన నేటికీ తమ వాహనాల నెంబర్ ప్లేట్లపై కార్పొరేటర్ అనే పదాన్ని తొలగించకుండా తిరుగుతున్నారని కమీషనర్ సరస్వతికి వినతి పత్రం ఇస్తున్న వల్లపు సుభాన్ యాదవ్, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, గుర్రం లక్ష్మీనర్సమ్మ తదితరులు

## 3 రోజులపాటు పోచమ్మ, ఏల్లమ్మ, మైసమ్మ బోనాల ఉత్సవాలు



అనిల్‌కుమార్‌కు ఆహ్వానిక పత్రిక అందజేస్తున్న గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, జులై 28 ప్రభాతవార్త:** పోచమ్మ, ఏల్లమ్మ, మైసమ్మ బోనాల పండగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత తెలిపారు. రామకృష్ణాపురం లోని పోచమ్మ, ఏల్లమ్మ, మైసమ్మ అమ్మవార్ల గుడి (మూడు గుళ్ళు) వద్ద ఈ నెల 31వ తేదీ నుంచి 3వ తేదీ వరకు బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 1వ తేదీ శుక్రవారం ఉదయం శ్రీరేణుకఎల్లమ్మ కల్యాణ మహోత్సవం, 3వ తేదీ ఆదివారం పోచమ్మ, ఏల్లమ్మ, మైసమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించుట, సాయింత్రం మైసమ్మ అమ్మవారి ఫలహర బండి ఊరేగింపు ఉత్సవము వివిధ కాలనీల గుండా శ్రీఖిల్లామైసమ్మ అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరభద్ర అనిల్‌కుమార్, మాజీడిప్యూటీ ఫ్లోర్‌లీడర్ దేప సురేఖాభాస్కర్‌రెడ్డికి సోమవారం ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, ప్రధానకార్యదర్శి బండి మధు, ఉపాధ్యక్షులు గట్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు లేని డివిజన్‌గా వనస్థలిపురంను తీర్చిదిద్దుతా : కార్పొరేటర్ రాగుల



భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రాగుల

**వనస్థలిపురం జూలై.28.ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్‌ని ఆదర్శవంత డివిజన్‌గా తీర్చిదిద్దుతానని డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి వెల్లడించారు. సోమవారం డివిజన్ పరిధిలో మల్లికార్జున నగర్ కాలనీలో 40 లక్షల రూపాయల నిధులతో రోడ్ నెంబర్ వన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్లాట్ నెంబర్ 50 నుంచి 96 వరకు సీసీ రోడ్డు పనులు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ వనస్థలిపురం డివిజన్ పరిధిలో నెలకొన్న 43 కాలనీలు సమస్యలను దశలవారీగా తీర్చిదిద్ది ఎల్బీనగర్ నియోజకవర్గం లోని వనస్థలిపురం డివిజన్ ని ఆదర్శం వంత డివిజన్ గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి గారు అన్నారు ఈ కార్యక్రమంలో కర్మన్ఘాట్ ఆంజనేయస్వామి దేవాలయ డైరెక్టర్ కవిత మల్లికార్జున్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్. జర్నల్ సెక్రటరీ ఎండి నిరంజన్. కోశాధికారి ఎండి షరీఫ్. ఉపాధ్యక్షుడు సాయి చరణ్. జర్నల్ సెక్రటరీ రాజేందర్ రెడ్డి జియో పాషా మహమూద్ .నాయకులు క్రిస్టియన్ కాలనీ ప్రెసిడెంట్ హరిందర్ రెడ్డి, సాయి కిరణ్ గౌడ్ కాలనీవాసులుటి రవీందర్.వెంకటేశ్వర్లు. జార్జ్ నందకుమార్. కె.చంద్రశేఖర్. ఎస్ వెంకటేష్. ఆర్ గుప్త అశ్విన్. షరీఫ్. అన్వర్. యూసుఫ్ , తదితరులు పాల్గొన్నారు

### ఉద్యమకారులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి



మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బొజ్జయాదగిరి

**తార్నాక, జులై 28 ప్రభాతవార్త :** దళిత జన సమితి ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని దళిత జన సమితి వ్యవస్థాపకులు,దళిత రత్న" బొజ్జ యాదగిరి కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులు ఎంతో మంది ఉన్నారని వారితో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి అనేక ప్రజా ఉద్యమాలు చేసి, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, సొంత గోడు లేకుండా అద్దె ఇళ్లలో నివసిస్తూ, ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రికి గుర్తు చేశారు. వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసి వారికి అందజేసి సహాయం చేయాలని వారు మంత్రిని కోరారు. వారి కలను సాకారం చేయాలనీ విజ్ఞప్తి చేశారు. అందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె సంపత్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు బొజ్జ రమేష్, రాష్ట్ర కార్యదర్శి భావండ్లపల్లి గంగాధర్, రాష్ట్ర బీసీ సంఘ నాయకులు ఎదునూరి సంపత్, ఉప్పల్ నియోజక వర్గ మైనార్టీ సెల్ ఇంచార్జ్ సయ్యద్ మాజిద్, కుమార్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

### శాంతినగర్, లక్ష్మీనగర్ కాలనీల సమస్యలు పరిశీలన



ప్రజా సమస్యలపై డిఇఇ వెంకన్నతో మాట్లాడుతున్న మాజీ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, జూలై 28 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని తన స్వంత డివిజన్ 31లోని శాంతినగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో సోమవారం మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కార్పొరేషన్ డిఇఇ వెంకన్న, ఎఇఇ హరీష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి తదితరులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె కాలనీవాసులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులతో అన్నారు. అనంతరం ఆమె అధ్వాన్నంగా తయారైన బడంగ్‌పేట్-బాలాపూర్ ప్రధాన రోడ్డును పరిశీలించి గుంతలను పూడ్చి రహదారి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమం లో వార్డు ఆఫీసర్ శ్రీకాంత్‌తో పాటు శ్రీనివాస్‌గుప్త, గిరి ముదిరాజ్, శివకుమార్, స్థానిక కాలనీలవాసులు పాల్గొన్నారు.